క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు బూచేపల్లి నివాళి



వెంకటేశ్వరరెడ్డికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూల మాలలు వేసి నివాళులర్పించారు. బెంగళూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వరరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబాన్ని బూచేపల్లి వెంకాయమ్మ పరామర్శించి వారికి అన్నీ విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

పుల్లలచెరువు: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్న సంఘటన శనివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని ఐటీ వరం గ్రామానికి చెందిన వెంకటనారాయణ పుల్లలచెరువు నుంచి అక్రమంగా 670 కేజీల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలించేందుకు సిద్ధంగా ఉండగా పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాధాకృష్ణ, ఎస్ఐ సంపతకుమార్‌లు ఆటోను తనిఖీ చేసి రేషన్ బియ్యంగా గుర్తించి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

ఇద్దరికి అవార్డులు



ఉత్తమ డీఈఓ సురేష్



ఉత్తమ బీఎల్ఓ చైతన్య

దర్శి: ఉత్తమ డీఈఓ (డేటా ఎంట్రీ ఆపరేటర్)గా దర్శికి చెందిన డేటాఎంట్రీ ఆపరేటర్ అవార్డును పునగాని సురేష్‌బాబు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ చేతుల మీదుగా ఒంగోలులో శనివారం అందుకున్నారు. ఉత్తమ బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారి)గా నారపుశెట్టి చైతన్య జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డులు అందుకున్న సురేష్, చైతన్యలకు పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు జిల్లాస్థాయి బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

యర్రగొండపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన క్విజ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ మేరకు శనివారం విద్యార్థులు పి.భరత్‌చంద్ర, ఎ.లక్ష్మీప్రసన్న, షేక్ మహబూబ్ సుభానీలకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ షీల్డ్‌లతో పాటు గుర్తింపు పత్రాలు అందజేశారు. వీరు నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కళాశాలకు జిల్లా స్థాయిలో మంచి పేరు తెచ్చిపెట్టిన విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, లెక్చరర్లు శ్రీనివాసరావు, రామకోటయ్య అభినందించారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన గాయత్రి



బహుమతి అందుకుంటున్న గాయత్రి

దర్శి: జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో దర్శి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని పి.గాయత్రి ద్వితీయ స్థానంలో రాణించింది. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఒంగోలులో నిర్వహించిన పోటీల్లో జిల్లాలో రెండో స్థానంలో గాయత్రి నిలిచింది. అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఫార్మేటివ్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

- రేపటి నుంచి ఫార్మేటివ్–3 పరీక్షలు
- పాఠశాలలకు చేరిన ప్రశ్నపత్రాలు

పుల్లలచెరువు:

ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్–3 పరీక్షలకు అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సీబీఏ పూర్తి క్లాస్ రూమ్ బేసిడ్ విధానంలో జరిగే పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలానికి సంబంధించిన పరీక్ష పత్రాల బండిల్స్ మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. యూపీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమక్షంలో వారి పాఠశాలలకు సంబధించిన ప్రశ్నపత్రాల బండిల్స్‌ను సరిచూసుకునే ప్రక్రియను పూర్తి చేశారు. వాటిని సబ్జెక్టుల వారీగా తేదీల వారీగా ట్రంక్ పెట్టెలో భద్రపరిచారు.

గంట ముందు హెచ్‌ఎంలకు చేరనున్న ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాలను పరీక్ష సమయానికి గంట ముందు మాత్రమే హెచ్‌ఎంలకు ఇవ్వనున్నారు. హెచ్‌ఎంలు పరీక్షలు ప్రశాతంగా, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. మండలంలో మొత్తం ప్రభుత్వ



ట్రంక్ పెట్టెలో భద్రపరిచిన ఫార్మేటివ్–3 క్వశ్చన్ పేపర్లు

అన్ని ఏర్పాట్లు చేశాం:
ఫార్మేటివ్– 3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. హెచ్‌ఎంలకు అవసరమైన అన్ని విధివిధానాలను వివరించాం. పరీక్ష పత్రాలు స్టాక్ పాయింట్‌లో భద్రపరిచాం. పరీక్షల ప్రారంభం రోజున వాటిని సబ్జెక్టుల వారీగా హెచ్‌ఎంలకు అందజేస్తాం. హెచ్‌ఎంలు తగు జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలిచ్చాం.
ఇందిర, ఎంఈవో, పుల్లలచెరువు

3,957 మంది పరీక్షలు రాయనున్నారని అధికారులు తెలిపారు.

ఇదీ..పరీక్షల షెడ్యూల్

27వ తేదీ ఉదయం సంస్కృతం, అదే రోజు రెండో సెషన్‌లో ఓరియంటల్ సంసంస్కృతం. 28వ తేదీ ఉదయం తెలుగు, అదే రోజు రెండో సెషన్‌లో గణితం, 29వ తేదీ ఉదయం హిందీ అదే రోజు రెండో సెషన్‌లో జనరల్ సైన్స్, 30వ తేదీ ఉదయం సోషల్ స్టడీస్, రెండో సెషన్‌లో ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించనున్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది మనోహరమ్మ

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దర్శి న్యాయస్థానం ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో దర్శి అడ్వకేట్ మనోహరమ్మ మాట్లాడారు. దొనకొండ ప్రాంతం వెనుకబడి ఉందని, ఇక్కడ మహిళలు చైతన్యం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మహిళ కేవలం వంట ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిస్థితులను అవగాహన చేసుకుంటూ మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకుని, చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతీయ న్యాయ సమీక్ష సెక్షన్ 63 మహిళా రేప్ లాంటి ఘటనకు గురైనప్పుడు తప్పు చేసిన వారికి యావజ్జీవ శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్క మహిళ చట్టాలపై అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మొట్టమొదటిగా ప్రతి మహిళా చదువుకోవాలని, చదువుతో సమాజంలో పరిస్థితులపై అవగాహన ఉంటుందన్నారు. ప్రతి మహిళ వారి పిల్లలకు చిన్నప్పటి నుంచి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే మహిళలకు మంచి ఉద్యోగాలు వస్తాయని, మహిళ చదువుకుంటే కుటుంబం, సమాజం బాగు పడుతుందని గుర్తు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి మాట్లాడుతూ మహిళలు చాలా మంది చదువుకుని మంచి ఉద్యోగాలు చేస్తున్నారని, అందుకు ఉదాహరణే కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు చేసుకుంటే చిన్న వయసులో పిల్లలు పుట్టి వారి ఆయుష్షు, సామర్థ్యం కుంగి పోతుందని గుర్తు చేశారు. బంగారం బాల్యం లాంటి పథకాలు మహిళలకు ఎంతో చేదోడు వాదోడుగా ఉంటాయని గుర్తు చేశారు. ఎంఈఓ సాంబశివరావు, ఏపీఎం వెంకటేశ్వర్లు, అడ్వకేట్ బల్లగిరి శీనయ్య, కోర్టు పీఎల్ఓ గుడిమెట్ల కోటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, వెలుగు వీఓఏలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి



కురిచేడు: ర్యాలీ నిర్వస్తున్న అధికారులు, విద్యార్థులు



దర్శి: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

దర్శి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.జాన్సన్ సూచించారు. పట్టణంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గడియారం స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు పట్టుకుని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం మన బాధ్యతని చెప్పారు. నిజాయతీపరులను ఎన్నుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు లేకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్ ఓటుపై ఆధారపడి ఉంటుందన్నారు. సంఘ సేవకులు జీవీ రత్నం, డీటీ దేవప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొనకొండ: ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నుంచి సచివాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు నినాదాలు చేస్తూ ఓటర్ల దినోత్సవం ర్యాలీని శనివారం నిర్వహించారు. ఓటు హక్కు విలువ, నిజాయితీగా ఓటు వేయాలని తహసీల్దార్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో మానవహారంగా ఏర్పాటు చేయించి ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ ఎస్.సాంబశివరావు, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, వీఆర్‌ఓలు, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కురిచేడు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు శనివారం విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో పాటు తహసీల్దార్ రజనీకుమారి, ఇతర శాఖల అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: ఓటు ఆయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కల్పించుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు డాక్టర్ కె.ప్రభుదాస్, డాక్టర్ నగేష్, డాక్టర్ జి.హనుమంతరావు, కె.రవీంద్ర, బీవీ రమణ పాల్గొన్నారు.



దర్శి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



దొనకొండ: ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుమలనాథస్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలతో అధ్యాపకులు

దొనకొండ: రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక శ్రీగౌతమీ డిగ్రీ కళాశాలలో అడ్మిన్ నానీ ఆధ్వర్యంలో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ, కేజీబీవీ, వివేకానంద, గౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు పరిశీలకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్‌తో జ్ఞానం చిగురిస్తుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలు పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు, మ్యాథమేటిక్స్ ప్రాజెక్టు, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజక్టులను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి వి.మౌనిక వివేకానంద స్కూల్, ద్వితీయ బహుమతి వై.నాతాన్, గౌతమీ డిగ్రీ కాలేజి, తృతీయ బహుమతి డి.నాగచరిత కేజీబీవి విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ రామయోగి మెమెంటో, మెడల్స్ బహూకరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



పెద్దారవీడులో జీవాలకు వైద్యం చేస్తున్న డాక్టర్ బాలునాయక్

పెద్దారవీడు: పశువైద్య శిబిరాలను పాడి తులు, జీవాల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు బాలునాయక్, వీరనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దారవీడు, మద్దలకట్ట గ్రామాల్లో శనివారం పశువులు, జీవాలకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా శిబిరాల్లో అవసరమైన వైద్య చికిత్సలు, మందులు అందజేస్తారని తెలిపారు. పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు, ఎద్దులకు నట్టల నివారణ ద్రావణాన్ని తాపించాలని పశు పోషకులకు సూచించారు. ఎలాంటి చిన్న సమస్య వచ్చినా అందుబాటులో ఉన్న పశు వైద్యశాలను సంప్రదించి సరైన చికిత్స చేయించుకోవాలన్నారు. పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ, గొర్రెల కాపరుల సంఘ అధ్యక్షుడు బి.శివ, వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల: సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని శివసదనం అతిథి గృహంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ ఏక పంట విధానం వద్దని, పలు పంటల విధానానికి మొగ్గు చూపాలన్నారు. ఆహార పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంలో ముందుకు సాగాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉన్న పండ్ల తోటల పెంపకం, పశువుల షెడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క గిరిజన రైతు కూడా పొలాలలను బీడు ఉంచకుండా ఆహార పంటలను వేసుకొని సాగులోకి రావాలన్నారు. అర్వోఎఫ్ఆర్ మండల కో ఆర్డినేటర్ మంతన్న, సీడబ్ల్యూఎస్ సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ బాలరాజు, నాగ పుష్పలత, వెలుగుఏపీఎం వెంకయ్య, పలు గిరిజన గూడేల చెంచు గిరిజనులు పాల్గొన్నారు.


పోలింగ్ పద్ధతిన ఎస్పీఎల్ ఎన్నిక




ఎస్పీఎల్‌ను అభినందిస్తున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్

యర్రగొండపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో స్కూల్, క్లాస్ పీపుల్ లీడర్ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోలింగ్‌లో 339 మంది విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఎన్నికలతో విద్యార్థుల్లో ఓటు హక్కుపై అవగాహన కలుగుతుందని, తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్న సందేశాన్ని అందించినవారమవుతామని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన స్కూల్, క్లాస్ పీపుల్ లీడర్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖిల కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఏఓ కొమ్ము రవి, ఉపాధ్యాయులు చంద్ర, మురళి, చెన్నయ్య, లక్ష్మీరెడ్డి, నబీఖాన్ పాల్గొన్నారు.


మంచు దుప్పటి



దర్శిలో ఉదయాన్నే కురుస్తున్న మంచు



ముండ్లమూరులో లైట్లు వేసుకుని వస్తున్న వాహనం



పొలాలు కనిపించకుండా కప్పేసిన మంచు

ముండ్లమూరు (దర్శి): దర్శి నియోజకవర్గంలో మూడు రోజులుగా మంచు అధికంగా కురుస్తోంది. తెల్లవారు జామున వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తెల్లవారిన తర్వాత కూడా లైట్లు వేసుకున్నా వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారు ఎప్పుడు ఏం వస్తాయో అని భయపడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

న్యాయ వ్యవస్థపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉషశ్రీ

యర్రగొండపాలెం: న్యాయ వ్యవస్థపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే తమకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడే శక్తి వస్తుందని మార్కాపురం న్యాయ సహాయ న్యాయమూర్తి ఎ.ఉషశ్రీ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విధాన్ సే సమాధన్ మహిళ న్యాయ విజ్ఞాన్ సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టం అందరికీ సమానంగా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న దాడులపై ఆమె వివరించారు. సదస్సులో తహసీల్దార్ బాలకిశోర్, ప్యానల్ లాయర్ ఝాన్సీరాణి, న్యాయవాదులు జి.గాలేశ్వరరావు, వి.గోవర్ధన్ పాల్గొన్నారు.